# మా బావ....!

[ యరబర్ల శ్రీరామమూర్తి ]

●

మా బావపోరుపడలేక బాపట్లలో దిగాను...

కుశల ప్రశ్నలు...కులాసా కబుర్లు...వేళాకోళాలు...పరిహాసాలు...స్నానాలు....భోజనాలు పూర్తయ్యాయి. కిల్లీ నములుతూ కూర్చున్నా. కుక్కిమంచంపై...'మన కులసంఘం పెట్టాలని కులపెద్దలంతా ప్రయత్నిస్తున్నార్రా అబ్బాయి' అన్నాడు మా బావ.

''కాపు సంఘం...కమ్మ సంఘం...రెడ్ల సంఘం...ఎందుకొచ్చిన సంఘాలు'...బావా! పెద్దనదిలో నీరుంటే, పిల్లనదుల్లోకూడా నీరుంటుంది...మనం బానిసత్వాన్ని బాపుకొని, స్వతంత్రం సంపాదిస్తే ఏచిక్కూ వుండదు...రాజకీయమైన చిక్కులు విడబడితే, ఆర్థికమైన చిక్కులు వాటంతట అవే విడిపోతాయి'' అన్నాను నేను.

''మీ చదువుకున్నవాళ్ళతో నెగ్గలేం బాబూ! ...దానికేంగాని, హెడ్ మాష్టారు డబ్బు ఇవ్వాలి, వెళ్ళివద్దాం రా'' అని కేకేశాడు మా బావ.

నేనూ మా బావ, మా అన్నయ్యా బాకీ వసూలు చేసేందుకు బయలుదేరి హెడ్ మాష్టారింటికి వెళ్ళాం. కుర్చీలమీద కూర్చున్నాం మా బావను, మా అన్నయ్యను హెడ్ మాష్టారు ఇదివరకే ఎరుగుదురు. అంచేత 'ఎవరు ఈయన' అని అడిగారు నన్ను చూపిస్తూ...

''మా తమ్ముడు పట్టణంలో చదువుతున్నాడు. వాళ్ళ బావను చూచిపోదామని ఇక్కడ దిగాడు'' అంటూ మా అన్నయ్య జవాబు చెప్పాడు...

''ఎప్పుడు వెళ్తారు మళ్లీ''...ప్రశ్నించారు హెడ్మాష్టారు...

''రేపు రాత్రికి''...అని జవాబిచ్చాను. నేను కూర్చున్న కుర్చీకి దగ్గరలోవున్న కిటికీపైగా వేలాడుతూన్న చైనాబొమ్మను చూస్తూ...పైకి చూస్తూన్న నాచూపు కిటికీలోంచి తొంగిచూస్తూన్న చూపులను కనిపెట్టింది.

''ఇందుకా మా బావ ఇక్కడకు తీసుకొచ్చింది'' అనుకున్నా...

''డబ్బు సాయంత్రం ఇస్తాను...అందుకేగా మీరు వచ్చింది'' అన్నాడు...ఎవరూ మాట్లాడలేదు. నేనేదో ఆలోచనలోపడ్డా...

''కాఫీకి వేళ అవుతోంది పోతాం'', అని లేచాడు మా బావ.

''మీరు కూర్చోండి. మీతో మాట్లాడాలి'' అని మా బావతో అంటూ ''మీరు వెళ్తూవుండండి. కాస్త నెమ్మదిగా వస్తాడు మీ బావగారు'' అన్నాడు హెడ్మాష్టారు మావంక చూస్తూ...

నేనూ, మా అన్నయ్యా శెలవుపుచ్చుకుని నేరుగా ఇంటికిచేరాం...మేంచేరిన పది నిముషాలకి మా బావకూడా వచ్చాడు...

''ఏం జరిగింది?'' మా అన్నయ్య ప్రశ్నించాడు మా బావను...

''పెళ్ళిళ్ళ రోజులు దగ్గరకు వస్తూన్నాయి... పెళ్ళికావలసిన పిల్లలువున్న తండ్రుల గోడు...ఏం చెప్పేది...ఈయనకు, హెడ్మాష్టరుకు ముగ్గురు ఆడపిల్లలు, ముగ్గురు మొగపిల్లలు వున్నారు. వచ్చే జీతాలు కుటుంబానికే చాలీచాలనట్టుగా వుంటుంది. ఎలాగో ఒక కూతురి వివాహంచేశాడు...రెండో కూతురికి పెళ్ళిచేయాలని...నీ విషయం కూడా వచ్చింది...

''ధనం గలవారికి ధనంమీదే మమకారం. మేం తూగలేం'' అన్నాడు...అబ్బే అలాంటిదేమీ లేదు. పిల్ల బాగుంటేసరి. మాకు డబ్బంటే ఆశలేదు అని నేను చెప్పాను...'' అన్నాడు మా బావ.

వెళ్ళింది ఒక పనికి, జరిగింది మరోపని. ఇలా సంఘటనలు తటస్థపడుతూంటాయి అప్పుడప్పుడు...

(తరవాయి 17 వ పేజీలో)

కాఫీ త్రాగాం...ఒక నిద్ర తీసి లేచి, బజారుకు పోదామని తయారవుతూండగా, హెడ్మాష్టరు వచ్చారు...బాకీ చెల్లించారు...సంసారం గొడవల గూర్చి మాట్లాడుకుంటూన్నాం...మాటల సందర్భంలో "పిల్లను చూద్దురుగాని రండి" అని ఆహ్వానించారు...

"ఎందుకులెండి. పెద్దవారుండగా" అన్నాడు మా అన్నయ్య...

"దానికేంలెండి...ఎవరి కర్మ ఎలావుందో" అంటూ బలవంతపెట్టసాగాడు...

"వెళ్తాం పిల్లను చూస్తాం...చాలా అందంగా వుంటుంది...అయితే ప్రయోజనం? తల్లితండ్రుల చెప్పుచేతల్లోవున్న నేను చూచినందువల్ల లాభమేముంది" అని అంతర్గతంగా నా అస్వతంత్ర జీవితాన్ని గూర్చి మదనపడ్డాను.

"నేను రావడం బాగుండదు...మా అన్నయ్య, మా బావ వస్తారు" అన్నాను.

ఆయన పట్టుపట్టాడు, "మీరు తప్పక రావాలి" అని...మా బావ మంకుపట్టాడు "నీవు రాందే నేను పోను" అని...

తప్పిందికాదు...

నలుగురం బయలుదేరి వారి ఇంటికి వెళ్ళాం. "ఫోర్తు ఫారం ప్యాసైంది...నూర్కలు పైనలు పాసు చేయిస్తాను...హిందీకూడా చెప్పిస్తున్నాను...హార్మోనియం వచ్చు...చక్కగా పాడగలదు" అంటూ క్వాలిఫికేషన్ లన్నింటినీ ఏకరువుపెట్టూ 'అమ్మాయ్! ఇలా రా' అని కూతురును పిల్చాడు...

ఆ అమ్మాయివచ్చి నిలబడింది...

నా చూపు...మా బావ చూపు...మా అన్నయ్య చూపు ఆ పిల్లమీద కేంద్రీకరించబడ్డాయి తండ్రి చూపు...తల్లి చూపు...పిల్ల చూపు నామీద కేంద్రీకరించబడ్డాయి...

తండ్రి చూపులో ఆడపిల్లలుగల తండ్రి ఆవేదన వ్యక్తమాతోంది...తల్లి చూపులో ఆశ నిరాశ తాండవిస్తోంది...

అమాయకత్వం...జాలి...వర్ణించటానికి వీలుకాని అదోవిధమైన రమ్యమైన 'ఫీలింగు'...ఆపిల్ల చూపులో పరుగెడుతూన్నాయి...

ఆ తల్లిదండ్రుల చూపులు—ఆడపిల్లలు కన్నవారి ఆవేదన—ములుకులై గుచ్చుకున్నాయి...

పిల్ల చూపు నాలో కలవరాన్ని లేపింది. ధనిక సమాజం ధనంకోసం పాకులాడే యీ ధనిక సమాజంలో అందానికీ....ఆనందానికీ....ప్రేమకూ... స్త్రీ పురుషుల పరస్పరాంగీకారాలకు తావేది? అందులోనూ నాబోటి అస్వతంత్రుని విషయంలో వేరే చెప్పాలా?

"వెళ్లమ్మాయీ!...అన్నాడు ఆయన.

పిల్ల లోపలికి వెళ్ళింది...కాని నా చూపు మళ్ళలా...

"ఎవరి గీత ఎలావుందో. మనమేం చెప్పగలం" అన్నాడు హెడ్మాష్టరు, కళ్లలో అమాయకత్వాన్ని కురిపిస్తూ...

జాలి, ఆవేదన—ఆడపిల్లలు అతన్ని చూచి జాలి, నా అస్వతంత్రతకు ఆవేదన—నన్ను పెనగొన్నాయి...

"శెలవు పుచ్చుకుంటాం" అని లేచాడు మా బావ... నేనూ లేచాను...

ఇంటి ముఖం పట్టాం...

"పిల్ల పస్టుగా వుందిరా" అన్నాడు మా బావ.

"ఇటువంటి పిల్లలను చేసుకునేప్పుడు కట్నాలు లేకపోతే నేం?...వేలూ బలాదూర్" అన్నాడు మా అన్నయ్య...

"నీవేం చేయలేవోయ్...సమాజానికి వ్యతిరేకంగా పోగేవో శలభంలా మాడిపోతావ్"... నిరుత్సాహంగా అరిచాడు నాలోనివాడు.

నవ్వాడు భౌతిక దేహుడు—